స్వశక్తి రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, జూలై 31 : ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద స్వశక్తి మహిళా సంఘాలకు అందించే రుణాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో 'ఇందిరా మహిళా శక్తి'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు ఆదాయ వనరుల కల్పన దిశగా ప్రభుత్వం రూపొందించిన పలు ప్రణాళికలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ముందుగా వివరించారు. అనంతరం అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలకు రుణాలు అందజేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో మహిళా సంఘాలకు రూ.500 కోట్లు రుణాలు అందజేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుత సంవత్సరం జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 1800, ఈడీఎస్సీ కార్పొరేషన్ ద్వారా మరో 600 పాడి పశువుల యూనిట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. కరీంనగర్ మిల్క్ డెయిరీ యూనిట్‌తో వీరిని సమన్వయం చేస్తామని, ఆసక్తి అర్హత కలిగిన మహిళా సంఘాల ద్వారా వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. 5,123 మైక్రో ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నామని, ప్రస్తుతం ఉన్న 3,392 వ్యాపార యూనిట్ల విస్తరణ, 1,607 నూతన వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ఉన్న వ్యాపార యూనిట్లు నడిపే మహిళా సంఘాలతో చర్చించి వారి అనుభవాలను కలెక్టర్ తెలుసుకున్నారు. వ్యాపార అభివృద్ధికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఏకరూప దుస్తులు కుట్టడంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు మహిళా సంఘాల సభ్యులను కలెక్టర్ అభినందించి సత్కరించారు. అలాగే, జిల్లాలో 10 నూతన మీ సేవా కేంద్రాలను మహిళలతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్ జిల్లా సమైక్య అధ్యక్షురాలు సరిత డీవో కరీంనగర్ డెయిరీ డాక్టర్ జయకర్, పశుసంవర్ధక శాఖాధికారి రవీందర్ రెడ్డి ఈడీఎస్సీ కార్పొరేషన్ స్వప్న డీడీఎం నాబార్డ్ దిలీప్ లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్ జీఎం ఇండస్ట్రీస్ భారతి పీడీఎఫ్ శ్రీనివాస్ జోనల్ మేనేజర్ శ్రీనిధి రవి కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు

గాంధీ చౌక్, జూలై 31: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.వేయి జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సృజన బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ క థనం మేరకు, కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన కుంట నా గరాజుకు గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన వసంతతో 2005 సంవత్సరంలో వివాహమైంది. వీరికి ఇ ద్దరు అమ్మాయిలున్నారు. కొన్నేళ్ల తర్వా త అదనపు వరకట్నం తీసుకొని రావాలని భార్యను వేధింపులకు గురి చేసేవాడు. భర్త వేధింపులు భరించలేక 2009వ సంవత్సరంలో గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో నాగరాజుపై భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ యమగంటి సతీశ్‌గౌడ్ వాదించగా ఎస్ఐలు రామ్మోహన్, రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ జనార్దన్‌రెడ్డి ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో నాగరాజుకు న్యాయమూర్తి శిక్ష విధించారు.

డీడీపీగా వీఎల్ ప్రసాద్

ఎల్లారెడ్డిపేట, జూలై 31: మండల కేంద్రానికి చెందిన వేముల లక్ష్మీ ప్రసాద్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఫస్ట్ అడిషనల్ కరీంనగర్ కోర్టు ఇన్‌చార్జి పీపీగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కేజ్‌వీల్ చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 31: మండల కేంద్రంలోని తన ట్రాక్టర్ కేజ్‌వీల్‌ను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ముత్యాల కృష్ణారెడ్డి తెలిపాడు. బాధితుడి వివరాల ప్రకారం, మంగళవారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో పొలాన్ని పొద్దుపోయేదాక దున్ని కేజ్‌వీల్స్ అక్కడే పెట్టి వచ్చానన్నాడు. బుధవారం తిరిగి వెళ్లి చూడగా ఒక కేజ్‌వీల్ మాయమైనట్లు తెలిపాడు. సదరు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు.

ఇసుక లారీల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 31: వెంకటాపూర్ శివారులో బుధవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తుండగా, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పట్టుకున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఇసుక లోడుతో ఉన్న లారీలను ఆపి ఆరాతీయగా అనుమతి లేదని తేలిందన్నారు. ఇందుకు కారణమైన డ్రైవర్లు, యజమానులైన గుండెవేన నగేశ్, గుండెవేన స్వామి, దూల వెంకటేశ్, పల్లపు కుమార్‌పై కేసు నమోదు చేసి లారీలను సీజ్ చేసి ఠాణాకు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

పోస్టాఫీసు పథకాలపై అవగాహన

ఇల్లంతకుంట, జూలై 31 : వెల్జిపూర్ గ్రామంలో పోస్టాఫీసు పథకాలపై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించామని తపాలా శాఖ సిరిసిల్ల సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వేణు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్తులు ప్రజలు పొదుపు చేయడం అలవాటుగా చేసుకోవాలన్నారు. వివిధ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ఉడుతల రజిత, తపాలా శాఖ సిబ్బంది సాయిరాం, సంజీవ్‌తోపాటు గ్రామస్తులున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

వీర్నపల్లి, జూలై 31: భూమి సరిహద్దు విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. మండలంలోని రాశిగుట్టతండాకు చెందిన రామవత్ రమేశ్, రామవత్ నారాయణ పొలాలు పక్కపక్కన ఉండడంతో కొన్ని రోజులుగా సరిహద్దు విషయంలో గొడవ జరుగుతున్నది. బుధవారం మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగగా నారాయణ బంధువులు తిరుపతి, రాజు, రఘుపతి అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఒకరికొకరు దాడి చేసుకున్నారు. ఇద్దరికి గాయాలవ్వగా, స్థానికులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సీఆర్‌ఎంఎఫ్ చెక్కుల పంపిణీ

వీర్నపల్లి, జూలై 31: మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు కమటం నాగరాజు బుధవారం పంపిణీ చేశారు. యాస వనజ రూ.18వేలు, సామల్ల సతీశ్ రూ.42వేలు, బోడ ప్రవీణ్, రూ.18, 500, కమటం చంద్రశేఖర్‌కు రూ.18 వేలు మంజూరైనట్లు తెలిపారు. ఇక్కడ ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు బోయిని రవి, నేతలు రాజు, రాజ్‌కుమార్, తదితరులున్నారు.

వేములవాడలో నిత్య జనగణమన

- మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ, జూలై 31: వేములవాడ పట్టణంలో నిత్య జనగణమన గీతాలాపన కార్యక్రమం ఏర్పాటు చేసి దేశభక్తిని పెంపొందిస్తామని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. బుధవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజలకు దేశభక్తిని పెంపొందించేలా వేములవాడ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో రూ.5 లక్షలతో మైకులు ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని కూడా అధికారులు ఆదేశించినట్లు ఆమె తెలిపారు. వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న రహదారులను కూడా మరమ్మతు చేయాలని అధికారులకు సూచించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ అన్వేశ్, వైస్ చైర్మన్ బింగి మహేశ్, డీఈ తిరుపతి, ఏఈ నర్సింహస్వామి, టీపీవో అన్సారీ, మేనేజర్ సంపత్‌రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సిరిసిల్ల టౌన్, జూలై 31: మున్సిపల్ పాలకవర్గం పట్టణాభివృద్ధే ప్రథమ లక్ష్యంగా పని చేస్తున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం సాధారణ సమావేశం నిర్వహించారు. అనంతరం చైర్‌పర్సన్ సమావేశంలో పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపిన అజెండా అంశాలను ప్రకటన ద్వారా వెల్లడించారు. పట్టణంలోని పలు వార్డుల్లో సీసీరోడ్ల మరమ్మతు పనులకు రూ.10లక్షలు మంజూరు చేశామని పేర్కొన్నారు. బతుకమ్మ ఘాట్ మ్యూజికల్ ఫౌంటేన్ నిర్వహణ, మరమ్మతు పనులకు రూ.4.50 లక్షలు, రగుడు ఫిల్టర్ బెడ్‌లో వివిధ పనుల కోసం రూ.20 లక్షలు, పట్టణంలోని పలు వార్డుల్లో మురికి కాలువల నిర్మాణం, కల్వర్టుల నిర్మాణ పనులకు రూ.9.65 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించామని పేర్కొన్నారు. మున్సిపల్ పాలకవర్గం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇక్కడ మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ డీ లావణ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చందుర్తి, జూలై 31: మానవ సంబంధాలు కనుమరుగవుతున్న క్రమంలో సంబంధాల బలోపేతం కోసం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'అవ్వ తాతకు ఉత్తరం రాద్దాం' అనే నినాదంతో పోస్టర్ ను ఆవిష్కరించారు. మండలంలోని ఎన్గల్ ప్రభుత్వ పాఠశాలలో అవ్వ తాతకు ఉత్తరం రాద్దాం అనే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయిని సునీత మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ అవ్వాతాతల అనుబంధం కాలక్రమేణ దూరమవుతుండడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ ఉపాధ్యాయులు నరేందర్, లక్ష్మీనారాయణ,కృష్ణ చైతన్య, సుస్మిత, చైతన్య భాస్కర్ ఉన్నారు.

వానకాలంలో అప్రమత్తంగా ఉండాలి

వీర్నపల్లి, జూలై 31: వానకాలంలో విద్యుత్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం సూచించారు. గర్జనపల్లి పంచాయతీ కార్యాలయంలో సెస్ వినియోగదారులు, రైతులతో బుధవారం సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను విడతలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. సెస్ బకాయిలు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నెల రోజులు గడువిస్తే విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటామని పలువురు రైతులు పేర్కొన్నారు. ఇక్కడ ప్రత్యేకాధికారి వెంకటేశ్, ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు బోయిని రవి, కాంగ్రెస్ నాయకుడు రాకేశ్‌గౌడ్, లైన్‌మన్ మహేందర్, తదితరులున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బ్యాటరీలు డెడ్

- వెనుతిరిగిన ప్రజలు

వేములవాడ, జూలై 31: వేములవాడ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విద్యుత్ బకాయిలు ఉండడంతో మంగళవారం సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే విద్యుత్ పునరుద్ధరణ కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయని అధికారులు కార్యాలయంలోని ఇన్వర్టర్ సహాయంతో సేవలు కొనసాగించే ప్రయత్నం చేశారు. అయితే 28 మంది రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి రాగా 18 రిజిస్ట్రేషన్లు పూర్తి అవడంతోనే సాయంత్రాని కల్లా బ్యాటరీ డెడ్ అయ్యాయి. దీంతో 10 రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా ప్రజలు వెనుదిరిగారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సి ఉండగా నిర్లక్ష్యం వహించడంతో తాము ఒకరోజు విలువైన సమయాన్ని కోల్పోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

గంజాయి అనుమానితులకు పరీక్షలు

రుద్రంగి, జూలై 31: రుద్రంగి మండల కేంద్రంలో గంజాయి సేవిస్తున్నారన్న అనుమానం ఉన్న యువకులకు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు బుధవారం గంజాయి టెస్ట్ (యూరిన్ పరీక్షలు) చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి సేవించే వారు ఇక తప్పించుకోలేరన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలోకి గంజాయి టెస్ట్ కిట్లు వచ్చాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలోనే గంజాయి టెస్ట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రుద్రంగిలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో అనుమానిత యువకులకు గంజాయి టెస్ట్ చేశామని తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, పోలీస్ సిబ్బంది రవి, ఓదెలు పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన పెంచలయ్య

సిరిసిల్ల టౌన్, జూలై 31: జిల్లాలోని హాస్పిటళ్ల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్)గా డాక్టర్ పంతగాని పెంచలయ్య బుధవారం జిల్లా దవాఖానలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు.

తాగునీటి బావిలో శునకం

మంగళ్లపల్లిలోని బావిలోంచి శునకాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోనరావుపేట, జూలై 31: మండలంలోని మంగళపల్లిలోని తాగునీటి బావిలో ఓ శునకం ప్రమాదవశాత్తు పడిపోయింది. బావిలో కుక్క అరుపులు విన్న గ్రామస్తులు 'డయల్ 100'కు ఫోన్ చేశారు. పోలీసులు చేరుకొని కుక్కను బయటకు తీసేందుకు విఫల యత్నం చేశారు. పోలీసుల సమాచారం మేరకు వేములవాడ అగ్నిమాపశాఖ సిబ్బంది బావివద్దకు చేరుకొన్నారు. ఆరు గంటలపాటు శ్రమించి మంచానికి తాళ్లు కట్టి వెలికితీశారు.

పాత నేరస్తులు ప్రవర్తనను మార్చుకోవాలి

పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ

గంభీరావుపేట, జూలై 31: గంజాయి, దొంగతనం కేసుల పాత నేరస్తులు తమ ప్రవర్తనను మార్చుకోవాలని వారిపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ సందర్శించారు. స్టేషన్ ఆవరణలో పాత నేరస్తులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. గంజాయి, దొంగతనం కేసుల నేరస్తులపై పోలీసుల నిఘా నిత్యం ఉంటుందన్నారు. నేరస్తులు తమ ప్రవర్తన మార్చుకోకపోతే హిస్టరీ షీట్స్ ఆధారంగా పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

శుభకార్యాల్లో పాల్గొన్న కొండూరి

నామకరణ కార్యక్రమంలో మాజీ నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి

సిరిసిల్ల టౌన్, జూలై 31: నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు బుధవారం సిరిసిల్లలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆంకారపు శ్రీహరి కల్యాణ మండపంలో జరిగిన బీఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి మనవడి నామకరణ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్ తండ్రి వీరబత్తిని లక్ష్మీపతి ఇటీవల మరణించగా వెంకంపేటలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్థానిక నెహ్రూనగర్‌లోని భవాని కల్యాణ మండపంలో జరిగిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ద్యావనపల్లి పరమేశ్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, తదితరులున్నారు.

బద్దిపోచమ్మకు ఆషాఢ బోనాలు

వేములవాడ టౌన్, జూలై 31 : ఆషాఢం సందర్భంగా బుధవారం వేములవాడ పట్టణంలోని శ్రీ బద్దిపోచమ్మ లాడ్జి అసోసియేషన్ ఆధ్వర్యంలో బద్దిపోచమ్మ అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జయారపు శ్రీధర్ ఆధ్వర్యంలో రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని స్వామివారికి పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో లాడ్జి అసోసియేషన్ అధ్యక్షుడు జయారపు శ్రీధర్, ఉపాధ్యక్షుడు గూడెల్లి శ్రీనివాస్, కోశాధికారి రేగుల శివప్రసాద్, కొప్పుల వెంకటేశ్, గంజి రాజిరెడ్డి, రేగుల లక్ష్మీనారాయణ, పొన్నం నర్సయ్య, మాధవ్, రాకేశ్, రమేశ్, నాగరాజు, కుమార్, రాజు, శ్రీనివాస్, మహేందర్, గంగాధర్, బాబు, శ్రీనివాస్, రాజు, మల్లేశం, రాజేందర్, నవీన్, కృష్ణ తదితరులున్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏఎస్పీ విచారణ

చందుర్తి, జూలై 31: మల్యాల గ్రామంలో రొండి బాలవ్వను కులం పేరుతో దూషించిన ఇదే గ్రామానికి చెందిన పులి వికాస్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. అలాగే కొత్తపేట గ్రామంలో ప్రవీణ్‌ను దూషించిన ప్రసాద్, స్వామిపై అట్రాసిటీ కేసు నమోదు కాగా ఏఎస్పీ విచారణ చేపట్టారు. ఏఎస్పీ వెంట చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వేములవాడ రూరల్, జూలై 31: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండలం వట్టెంలలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో మీ కోసం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతి, గ్రామస్తులున్నారు.

వేతనాలు పెంచాలని కార్మికుల నిరసన

ఎల్లారెడ్డిపేట, జూలై 31: తమ కష్టానికి తగిన వేతనాలివ్వాలని పారిశుధ్య కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఊరంతా మురుగును శుభ్రం చేసే క్రమంలో ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ తమ శ్రమను ప్రభుత్వం గుర్తించడంలేదని ఆరోపించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని మంగళవారం నిరసన కార్యక్రమానికి వెళ్దామనుకుంటే తమను ముందస్తు అరెస్టు చేశారని తెలిపారు. ఇక్కడ జల్లి బాలయ్య, జల్లి శంకర్, ఎనగందుల రాజు తదితరులున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

ఉపాధ్యాయుడు పరమేశ్వర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

తెలంగాణ చౌక్, జూలై 31: చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది, పవిత్రమైనదని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు ద్యావన్‌పల్లి పరమేశ్వర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్సీ హాజరై, మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనేది వృత్తికే కాని మనం అందించే సేవలకు కాదని, వీలైనంత వరకు సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఉపాధ్యాయులుగా పరమేశ్వర్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, డీఈవో రమేశ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, హెచ్‌ఎం భాగ్యరేఖ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలి

వీర్నపల్లి, జూలై 31: గ్రామాల్లో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని గర్జనపల్లిలో బుధవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల వివక్షకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఇక్కడ ఆర్ఐ ప్రవీణ్, ప్రత్యేకాధికారి వెంకటేశ్, కాంగ్రెస్ నాయకుడు రాకేశ్‌గౌడ్, గ్రామస్తులున్నారు.

రుద్రంగి, జూలై 31: పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని రుద్రంగి మండలం అడ్డబోర్‌తండా గ్రామంలోని పంచాయతీ ఆవరణలో ఆర్ఐ నవీన్ ఆధ్వర్యంలో బుధవారం అధికారులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశానుసారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించామన్నారు. ఎవరైనా కులవివక్ష పాటించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్, కార్యదర్శి తిరుపతి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడ రూరల్: రుద్రవరంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు

చందుర్తి : బోనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

బోయినపల్లి, జూలై 31: బోయినపల్లిలో ఆనంద్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు బోనాల వేడుక నిర్వహించారు. ఆనంద్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు సంప్రదాయంగా బోనాలు తీసి, పోతరాజుల వేషధారణతో డీజే చప్పుళ్ల మధ్య బస్టాండ్ వద్ద నృత్యం చేశారు. అనంతరం బస్టాండు నుంచి ప్రధాన వీధుల మీదుగా భారీ ర్యాలీతో పాఠశాలకు తరలి వెళ్లారు. బోయినపల్లి మోడల్ స్కూల్లో కూడా బోనాల వేడుక నిర్వహించారు. కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఓ వర్గం వారు కూడా పోచమ్మ బోనాలు తీశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్, ఆనంద్ విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బిల్ల ఆనందం, హెచ్‌ఎం చంద్రమౌళి ఉన్నారు.

వేములవాడ రూరల్, జూలై 31: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో మార్కండేయ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాడురి రాములు, ఉపాధ్యక్షుడు వాసాల మహేందర్, ప్రధాన కార్యదర్శి ఎలగందుల రమేశ్, క్యాషియర్ రాజేంద్రప్రసాద్, కృష్ణహరి, నర్సయ్య, కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు బోనాల పండుగలో భాగంగా పోచమ్మకు బోనాలను సమర్పించారు. విద్యార్థులు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య పోతరాజు వేషధారణతో సంబురాలు చేసుకున్నారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు బాలచందర్, కవిత, రవికుమార్, బాబు, ప్రేమ్‌కుమార్, సంతోష్, శ్రీదేవి, లత, విద్యార్థులున్నారు.

చందుర్తి,జూలై 31: లింగంపేట గ్రామంలో మహోదయ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పోచమ్మ బోనాలను బుధవారం కరస్పాండెంట్ ఏనుగుల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు బోనాలను ఊరేగింపుగా తీసుకొని పోచమ్మ ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. ఇక్కడ ఉపాధ్యాయులు ఏనుగుల రేణుక, కముటం స్వప్న, మెంగలి కవిత, పాహిమా, ప్రియాంక, విద్యార్థులున్నారు.


వేములవాడ రూరల్: బాలరాజుపల్లి ప్రభుత్వ స్కూల్లో బోనాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి క్యాంపులు

కలెక్టరేట్, జూలై 31 : జిల్లాలోని దివ్యాంగులకు ఉపకరణాలు, సహాయక పరికరాలను ఉచితంగా పంపిణీ చేయడానికి అర్హులైన వారి ఎంపికకు క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ALIMCO సంస్థ ADIP పథకం ద్వారా దివ్యాంగులకు తెలంగాణ వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ సంయుక్త భాగస్వామ్యంతో జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. కావున అర్హులైన దివ్యాంగులందరూ జిల్లాలోని వివిధ మండలాల్లో నిర్వహించే ఈ శిబిరాలకు హాజరు కావాలని ఆయన కోరారు. దివ్యాంగులు సదరం వైద్య ధ్రువీకరణ, కార్డు ధ్రువీకరణ, రేషన్‌కార్డు, ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ, రెండు ఫొటోలతో శిబిరాలకు రావాలని కోరారు. క్యాంపులను ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈనెల 5న బోయినపల్లి రైతు వేదిక, 6న ఇల్లంతకుంట రైతు వేదిక, 7న వేములవాడ మండల పరిషత్ కార్యాలయం, 8న చందుర్తి రైతు వేదిక, 9న ఎల్లారెడ్డిపేట రైతు వేదిక, 10న సిరిసిల్ల సినారె కళా మందిరంలో నిర్వహిస్తారన్నారు. శిబిరాలకు అర్హులైన దివ్యాంగులు సరైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని లక్ష్మీరాజం ప్రకటనలో కోరారు.

స్కూటి అదుపు తప్పి ఒకరికి గాయాలు

సిరిసిల్ల రూరల్, జూలై 31: తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని వయోవృద్ధుల ఆశ్రమం ప్రాంతంలో స్కూటీ అదుపుతప్పి కిందపడగా ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 ద్వారా సిరిసిల్ల దవాఖానకు తరలించారు. కాగా గాయపడ్డ వ్యక్తి కేసీఆర్‌నగర్‌కు చెందిన వ్యక్తి అని తెలిసింది.

తల్లి పాలు పిల్లలకు అమృతం

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

కలెక్టరేట్, జూలై 31 : తల్లి పాలు పిల్లలకు అమృతంతో సమానమని, తల్లి పాల ప్రాముఖ్యతను అంతటా చాటుదామని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తారన్నారు. బిడ్డ, తల్లుల జీవితాల్లో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించడం, ఐసీడీఎస్ సెక్టార్ సమావేశాలు నిర్వహించడం, ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో ప్రసవించే మహిళలందరికీ తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తారని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు అందజేత

రాంనగర్, జూలై 31 : సిరిసిల్ల జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అంజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ నుంచి అందిన రూ.నాలుగు లక్షల ఇన్సూరెన్సు చెక్కును బుధవారం అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అంజయ్య భార్య పద్మకు అందజేశారు.

అటవీ అధికారులు అడ్డుకున్నారని..

- గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం


ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న రాజు

వీర్నపల్లి, జూలై 31: తన పట్టా భూమిని దున్ననీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారనే మనోవేదనతో ఓ గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండాకు చెందిన అజ్మీరా రాజు బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని తన పట్టాభూమిని దున్నేందుకు ట్రాక్టర్‌తో బయల్దేరాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ కిరణ్ అక్కడికి చేరుకొని అడ్డగించాడు. ట్రాక్టర్‌ను అటవీ కార్యాలయానికి తరలిస్తుండగా, రాజు తన కుటుంబ సభ్యులతో కలిసివచ్చి అడ్డుకున్నాడు. ఈ సందర్భంలో ఎఫ్‌బీవో రాజు, కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన భూమిని సాగు చేయకుండా ఇబ్బంది చేస్తున్నావంటూ మనస్తాపం చెందిన రాజు బీట్ అధికారి ముందే గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు చికిత్స కోసం 108లో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఇదే విషయంపై బీట్ అధికారి కిరణ్‌ను ఫోన్‌లో సంప్రదించగా, అటవీ భూమిని అక్రమించి సాగు చేస్తున్నారనే సమాచారం మేరకు బాబాయిచెరువుతండాకు వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను వీర్నపల్లికి తరలిస్తుండగా రాజుతో పాటు కుటుంబసభ్యులు అడ్డుకొని దాడి చేశారని పేర్కొన్నారు. విధులకు ఆటంకం కలిగించి, తనపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.